
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సంగారెడ్డి 5 మెదక్ జిల్లాల వార్తలు
మంగళవారం 21 జనవరి 2025



నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పటాన్‌చెరు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : కొత్త సర్వీస్‌లకు కనెక్షన్లు ఇచ్చేందుకు అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని పలు ప్రాంతాల్లోని విద్యుత్ సరఫరాలో స్వల్ప అంతరాయం కలుగుతుందని ఏఈ రామకృష్ణ పేర్కొన్నారు. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు గ్రీన్‌మీడోస్, గీతాహోమ్స్ సిద్ధార్థ కాలనీ, నందన్‌హోమ్స్, ప్రణీత్‌విల్లాస్ తులసివనం తదితర కాలనీల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని గమనించాలన్నారు.



పూర్తయిన అగ్నిగుండం, పెద్దపట్నం

ఆలయం నుంచి ఉత్సవ విగ్రహాలను తోటబావికి తీసుకొస్తున్న అర్చకులు

బండారు మల్లన్నా... గండాలు బాపన్నా

- పసుపు సింగిడిగా మారిన కొమురవెల్లి
- ఘనంగా పట్నంవారం పెద్దపట్నం, అగ్నిగుండాలు
- నిప్పుల్లో చిందేసిన శివసత్తులు, పోతరాజులు, భక్తులు
- పులకించిన అశేష భక్తజనం
- భక్తిపారవశ్యంలో ఓలలాడిన కొమురవెల్లి



చంటిబిడ్డను ఎత్తుకుని వీరకోలతో సిగమూగుతున్న భక్తురాలు

కొమురవెల్లి మల్లేశా.. శరణు.. శరణు.. అంటూ మల్లన్న నామ స్మరణతో అశేష భక్తజనులు పులకించారు. చేతిలో వీరకోల ధరించి దేవదేవుడి ఆవాహనంతో సిగమూగారు. శివసత్తులు, పోతరాజులు, భక్తులు కణకణమని రగిలే నిప్పుల్లో చిందులేసి మైమరిచిపోయారు. భక్తి పారవశ్యంలో అగ్నిగుండాలు దాటి మొక్కులు తీర్చుకున్నారు.

చేర్యాల, జనవరి 20(ఆంధ్రజ్యోతి): కొమురవెల్లి మల్లిఖార్జునస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా పట్నంవారాన్ని పురస్కరించుకుని సోమవారం హైదరాబాద్‌కు చెందిన యాదవ సంఘం ఆధ్వర్యంలో ఆలయ తోటబావి ప్రాంగణంలో మల్లన్నకు అత్యంత వైభవోపేతంగా పెద్ద పట్నం వేసి అగ్నిగుండాలు నిర్వహించారు. యాదవ పూజారులు పసుపు, కుంకుమ, పచ్చ, బియ్యంపిండి, సునేరు, పంచరంగులతో పెద్దపట్నాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు.



అగ్నిగుండాలు దాటుతున్న భక్తులు

వంటచెరుకుతో అగ్నిగుండాలను తయారుచేశారు. పెద్దపట్నానికి చిత్రకన్ను అమర్చి గుమ్మడికాయలను అష్ట దిక్పాలకులకు అలంకరించారు. మల్లన్న చరిత్ర, మహిమలను వివరిస్తూ యాదవ పూజారులు ఒగ్గుకథను ఆలపించగా భక్తులు జయజయధ్వానాలు చేయడంతో ఆలయ పరిసరాలు ప్రతిధ్వనించాయి. భక్తిప్రపత్తులతో వేస్తున్న పట్నాన్ని తిలకిస్తూ అశేష భక్తజనం పులకించిపోయారు. బండారిని ఒంటి నిండా ధరించడంతో పాటు తోటివారిని మల్లన్నగా భావించి పసుపు

మిగతా 7వ పేజీలో...

లెక్క తేల్చేద్దాం..

నేటి నుంచి 24 వరకు గ్రామ, వార్డు సభలు

- ఇందిరమ్మ ఇళ్లు, ఆత్మీయ భరోసా అర్హుల పేర్లు ప్రకటన
- రైతుభరోసా, కొత్త రేషన్‌కార్డు లబ్ధిదారుల జాబితా ప్రదర్శన
- అభ్యంతరాలు, కొత్త దరఖాస్తుల స్వీకరణ

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, జనవరి 20: ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీల్లో మరో నాలుగు అమలు చేసేందుకు ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేసింది. ఈ నెల 26 నుంచి అమల్లోకి రానున్న నాలుగు సంక్షేమ పథకాల లబ్ధిదారుల ఎంపికపై ఉమ్మడి మెదక్ జిల్లాలో కసరత్తు తుది దశకు చేరుకుంది. ఆరు గ్యారెంటీలతో పాటు పలు పథకాల కోసం ప్రజాపాలనలో దరఖాస్తులు స్వీకరించిన విషయం తెలిసిందే. కుటుంబ సర్వే ద్వారా వివరాలను సేకరించారు. తాజాగా దరఖాస్తుదారుల్లో అర్హులను గుర్తించేందుకు క్షేత్రస్థాయి సర్వే చేపట్టారు. నేటి నుంచి లబ్ధిదారుల ఎంపిక కోసం గ్రామ, వార్డు సభలను నిర్వహిస్తున్నారు.



కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా మరో 4 పథకాలకు శ్రీకారం చుడుతోంది. ఎలాంటి లోటుపాట్లు లేకుండా అర్హులకు లబ్ధి చేకూర్చడానికి పలుమార్లు సర్వే చేపట్టారు. ఈ పథకాలన్నీ దాదాపు ప్రతీ కుటుంబంతో ముడిపడిఉన్నవే కావడంతో సర్వత్రా చర్చ కొనసాగుతోంది. ఎవరెవరిని లబ్ధిదారులుగా ఎంపిక చేశారోననే విషయం మరికాసేపట్లో బయట పడబోతున్నది. ఈ నెల 24 వరకు దశలవారీగా అన్ని గ్రామాలు, మున్సిపల్ వార్డుల్లో సభలను నిర్వహించడానికి అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేస్తోంది.

రైతులు, కూలీలకు భరోసా అందేనా?

గత ప్రభుత్వ హయాంలో రైతులకు పెట్టుబడి సాయం కింద ఎకరాకు ఏటా రూ.10వేల చొప్పున రైతుబంధు ఇచ్చారు. ప్రస్తుత ప్రభుత్వం ఎకరాకు రూ.12వేలు ఇవ్వనున్నది. దీనికి సంబంధించి వ్యవసాయంపై ఆధారపడిన రైతుల జాబితాను గుర్తించారు. వీరికి రైతుభరోసా పేరిట ఈ నెల 26న పెట్టుబడి సాయం జమచేయడానికి సన్నాహాలు చేశారు. అదేవిధంగా వ్యవసాయ కూలీలకు ఏటా రూ.12వేలు ఇచ్చేలా ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. దాదాపు అన్ని గ్రామాల్లో వ్యవసాయ కూలీలు పెద్ద సంఖ్యలో ఉంటారు. వీరందరికి ఏటా రూ.12వేలు ఇవ్వాలంటే అసాధ్యం. అందుకే సర్వే ద్వారా కొందరి పేర్లను ఫైనల్ చేశారు. ఈ జాబితాలో ఎవరెవరు ఉన్నారో నేటి నుండి తేటతెల్లం కాబోతున్నది.

కొత్త రేషన్‌కార్డులపై తికమక

ఇటీవల గ్రామాలు, పట్టణాల్లో సర్వే చేపట్టిన అధికారులకు ప్రజల నుంచి నిలదీతలు తప్పలేదు. కొత్త రేషన్‌కార్డుల కోసం, మార్పులు,చేర్పుల కోసం దరఖాస్తు చేసుకున్నా జాబితా పేర్లు రాలేదని మండిపడ్డారు. అయితే కొత్త రేషన్‌కార్డులపై కుటుంబ సర్వేను మాత్రమే పరిగణనలోకి తీసుకున్నామని పలుచోట్ల వివరణ ఇచ్చారు. ఈ వివరణలు వివాదాస్పదంగా మారడంతో ప్రభుత్వం పునరాలోచన చేసింది. కుటుంబ సర్వేతోపాటు మీసేవ, ఆన్‌లైన్‌లో చేసిన దరఖాస్తులను సైతం పరిగణనలోకి తీసుకుంటామని, దీని ఆధారంగానే కొత్త రేషన్‌కార్డులు ఇస్తామని స్పష్టం చేయడంతో ఆందోళనలు సద్దుమణిగాయి. నేటి నుంచి జరిగే గ్రామ, వార్డు సభల్లోనూ రేషన్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించారు.

ఇందిరమ్మ ఇళ్లకు డిమాండ్

ఇందిరమ్మ ఇళ్ల పేరిట ప్రభుత్వం ఒక్కో ఇంటికి రూ.5లక్షల సహాయం ఇస్తున్న క్రమంలో సొంతింటి కోసం పోటీపడుతున్న వారి సంఖ్య భారీగా ఉంది. ఉమ్మడి మెదక్ జిల్లావ్యాప్తంగా ఇళ్ల కోసం 7.40 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. ప్రభుత్వం నియోజకవర్గానికి 3,500 ఇళ్ల చొప్పున ఉమ్మడి జిల్లాకు 40వేల ఇళ్లు మాత్రమే కేటాయించింది. ఈ లెక్కన 7 లక్షల దరఖాస్తులను పక్కనపెట్టాల్సి ఉంటుంది. తర్వాతి దశల్లో వీరికి అవకాశం కల్పిస్తారని చెబుతున్నప్పటికీ ఇళ్ల విషయంలో రచ్చ జరిగే అవకాశాలు లేకపోలేదు.

లోటుపాట్లపై బీఆర్ఎస్ ఫోకస్

గ్రామ, వార్డు సభల్లో పథకాల్లో లోటుపాట్లపై నిలదీసేందుకు బీఆర్ఎస్ సిద్ధమవుతోంది. అర్హుల పేర్లు జాబితాలో లేకుంటే సభల్లోనే అధికారులను నిలదీసేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. అంతేగాకుండా ప్రధానంగా ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్లపైనే బీఆర్ఎస్ శ్రేణులు దృష్టిపెట్టారు. ఎలాంటి పైరవీలు, పలుకుబడులు లేకుండా అర్హులకే పథకాలు వచ్చేలా చూడాలని మాజీ మంత్రి హరీశ్‌రావు తమ పార్టీ కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. దీనిపై కరపత్రం కూడా విడుదల చేశారు.

గ్రామ, వార్డు సభల నిర్వహణ తీరు

- ముందుగా సభల్లో ప్రత్యేకాధికారిని వేదిక పైకి ఆహ్వానించడం
- అధికారులు, ప్రత్యేక ఆహ్వానితులకు వేదిక పైకి పిలుపు
- గ్రామసభ ఎజెండా చదివి వినిపించడం
- ఇందిరమ్మ ఇళ్లు, రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, నూతన రేషన్‌కార్డుల జారీ గురించి ప్రజలకు వివరించడం
- 4 పథకాలకు సంబంధించి అర్హుల జాబితాను బహిరంగంగా ప్రకటించడం..
- ప్రజల నుంచి అభ్యంతరాలను స్వీకరించడం
- నూతన దరఖాస్తుల స్వీకరణ
- తీర్మానాన్ని ప్రవేశపెట్టి ఆమోదించడం
- సభకు ధన్యవాదాలు తెలుపుతూ ముగించడం

జిల్లా	గ్రామాలు	మున్సిపల్ వార్డులు
సంగారెడ్డి	646	203
సిద్దిపేట	514	115
మెదక్	469	75
మొత్తం	1,629	393

పార్టీలకతీతంగా

అందరికీ పథకాలు

- నిజమైన అర్హులకు సంక్షేమ ఫలాలందించడమే ప్రభుత్వ లక్ష్యం
- విద్యాలయాల్లో వసతుల కల్పనపై ప్రత్యేక శ్రద్ధ
- వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ



రాయికోడ్ వీరభద్ర ఆలయ పాలకవర్గ ప్రమాణ స్వీకారోత్సవంలో మంత్రి దామోదర్ రాజనర్సింహ

రాయికోడ్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతి ఒక్కరికీ పార్టీలకతీతంగా ప్రభుత్వ పథకాలు అందించాలనేదే ప్రభుత్వ లక్ష్యమని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ పేర్కొన్నారు. మండల కేంద్రమైన రాయికోడ్‌లోని భద్రకాళీ సమేత వీరభద్రేశ్వర ఆలయ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి అవసరమైన నిధులు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. 15 రోజుల్లో కప్పాడ్-రాయికోడ్ రోడ్డు నిర్మాణ పనులు పూర్తిచేయిస్తామని పేర్కొన్నారు. విద్యాభివృద్ధికోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తున్నదని పేర్కొన్నారు. మోడల్ స్కూల్‌కు సీసీ రోడ్డు, గురుకులపాఠశాలకు ఆటస్థలం, సీసీ రోడ్డు పనుల కోసం నిధులు కేటాయిస్తానని, పలు అభివృద్ధి పనులు చేయిస్తానని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపు కోసం ప్రతి కార్యకర్త కృషి చేయాలని ఆయన సూచించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ జి.అంజయ్య, తాజా మాజీ జడ్పీటీసీ మల్లికార్జున్, నాయకులు సిద్దన్నపాటిల్, బస్వరాజ్‌పాటిల్, సుభాష్‌పాటిల్, ఏసయ్య, బాలాజీ, నర్సింలు, ప్రభాకర్‌చారి, సతీష్‌కుమార్, దిగంబర్‌రావు, రామిరెడ్డి, యాదగిరి, సుధాకర్‌రెడ్డి, వినయ్, జగన్మోహన్‌రెడ్డి, శేషారెడ్డి, జ్ఞానేశ్వర్, హనుమాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

విద్య, వైద్యానికి ప్రాధాన్యం

మునిపల్లి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): విద్య, వైద్యానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నదని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్‌రాజనర్సింహ పేర్కొన్నారు. బుదేరా చౌరస్తాలోని గురుకుల మహిళా డిగ్రీ కళాశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల, తాటిపల్లి గ్రామం సమీపంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలను సోమవారం మంత్రి అకస్మికంగా తనిఖీ చేశారు. మంత్రి వెంట ఆర్డీవో రవీందర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సంగారెడ్డి చౌరస్తాలోని ఓ హోటల్‌ను తనిఖీ చేస్తున్న ఫుడ్‌సేఫ్టీ అధికారులు

ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలు

సంగారెడ్డి అర్బన్, జనవరి 20(ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఫుడ్ సేఫ్టీ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. 'ఫిర్యాదు చేస్తేనే తనిఖీలు' అనే శీర్షికన ఈ నెల 17న 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి ఉన్నతాధికారులు స్పందించారు. అదనపు కలెక్టర్ ఆదేశాల మేరకు తనిఖీలు చేశారు. ఇందులో భాగంగా సోమవారం సంగారెడ్డి పోతిరెడ్డిపల్లి చౌరస్తా సమీపంలోని ఓ రెస్టారెంట్‌లో అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ అమృతశ్రీ, ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ రాజేశ్వర్‌లు కలిసి తనిఖీలు చేశారు. రెస్టారెంట్‌లో నాన్ వెజ్ ఫుడ్ ఇతరత్ర ఆహార పదార్థాలు నిల్వ ఉంచడాన్ని గుర్తించి పారబోయించారు. అనంతరం పెద్దాపూర్ సమీపంలోని మరో రెస్టారెంట్‌లో తనిఖీలు నిర్వహించారు. ఇరు రెస్టారెంట్లలో పరిశుభ్రత పాటించాలని, ఫుడ్, ఆహార పదార్థాలను ఎప్పటికప్పుడు వండి వినియోగదారులకు వడ్డించాలని వారు ఆదేశించారు.

అంబేడ్కర్‌ను అవమానించిందే కాంగ్రెస్

- భారతరత్న అవార్డు ఇచ్చి గౌరవించింది బీజేపీ
- మెదక్ ఎంపీ రఘునందన్‌రావు

7



ఒత్తిడి భరించలేక పదో తరగతి విద్యార్థిని ఆత్మహత్య

- ఎంత చదివినా గుర్తుండడం లేదని మనస్తాపం

7

'ప్రజావాణి' అర్జీలను త్వరితగతిన పరిష్కరించండి

8

మళ్లీ చలి

కోహీర్‌లో 8.9 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు



కోహీర్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలంలో చలి తీవ్రత మళ్లీ పెరిగింది. పది రోజుల క్రితం తగ్గుముఖం పట్టిన చలి మరోసారి తీవ్రమవుతున్నది. 19వ తేదీ నుంచి చలి తీవ్రత మళ్లీ పెరిగింది. కోహీర్ మండలంలో సోమవారం ఉదయం 8.9 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కాగా మెదక్ జిల్లా శివనూరులో 12.2 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయింది. సిద్దిపేట జిల్లాలోని కొండపాకలో 10.9 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయింది. సోమవారం ఉదయం చలి తీవ్రత ఎక్కువగా ఉంది. చల్లని ఈదురుగాలు కూడా తోడు కావడంతో చలి తీవ్రత పెరిగిపోయింది. దీంతో ప్రజలు ఉదయం పూట చలికి ఇబ్బందులు పడ్డారు. మధ్యాహ్నం ఉష్ణోగ్రతలు మెరుగ్గా ఉన్నప్పటికీ రాత్రి సమయంలో ఉష్ణోగ్రతలు పడిపోయి చలి తీవ్రత పెరుగుతుంది. మరో నాలుగు రోజులు చలి తీవ్రంగానే ఉంటుందని వాతావరణ నిపుణులు పేర్కొన్నారు.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సోమవారం ఉదయం నమోదైన ఉష్ణోగ్రత వివరాలు..

కోహీర్ 8.9, అల్గోల్ 9.9, న్యాల్‌కల్ 10.2, మల్‌చేల్మ 10.5, సత్వార్ 10.7, మొగుడంపల్లి 10.9, ఆర్‌సి పూరం 11.0, కంకోల్ 11.1, ఝరాసంగం 11.1, నల్లవల్లి 11.2, కంగ్టి 11.4, దిగ్వాల్ 11.7, అల్మాయిపేట12.0, సిర్గపూర్ 12.1. జహీరాబాద్ 12.2, లక్ష్మీసాగర్ 12.2, ముక్తపూర్ 12.2, నిజాంపేట్ 12.3, కంది 12.4, గుండ్ల మాచనూరు 12.4, ఫుల్కల్ 12.5, కడ్పల్ 12.5, జిన్నారం 12.5, కల్హేర్12.6, హత్నూర 12.6, పాశమైలారం 12.6, అన్నాసాగర్ 12.7, చౌటకూరు 12.9,, నాగలిగిద్ద 13.0 ఉష్ణోగ్రతలు నమోదు కాగా మెదక్ జిల్లాలోని శివనూరు 12.2, బుడగట్ 12.2, లక్ష్మాపూర్ 12.4, దొంగల ధర్మారం 12.5, రామాయంపేట 12.7, చిప్పల్ తుర్తి 12.7, నాగపూర్ 12.7, కల్లకల్ 12.8, శివంపేట్ 12.7, చేగుంట12.8, మనోహరాబాద్ 12.9, కుల్చారం 12.9, టేక్మాల్ 13.0, ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఇక సిద్దిపేట జిల్లాలోని కొండపాక 10.9, అంగడికిష్టాపూర్ 11.2, మిరుదొడ్డి మునిగండప్ప 12.0, పోతిరెడ్డిపేట్ 12.1, బేగంపేట్ 12.3, పెద్ద కోడూరు 12.3, నారాయణరావుపేట్ 12.3, చిట్యాల్ 12.4 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.

గ్రామ సభలకు విస్తృత ఏర్పాట్లు : కలెక్టర్

మెదక్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): నాలుగు పథకాల అమలు కోసం చేపడుతున్న గ్రామ సభలకు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. టేక్మాల్‌లో లబ్ధిదారుల గుర్తింపు సర్వేను సోమవారం ఆయన పరిశీలించారు. వ్యవసాయ యోగ్యం గాని భూములను సందర్శించారు. ఆహార భద్రత కార్డులు, రైతు భరోసా పథకాలకు సంబంధించి క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపిన అంశాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. సంబంధిత వివరాలతో కూడిన రిజిస్టర్లను తనిఖీ చేసి గ్రామ సభల నిర్వహణపై అధికారులకు సూచనలు చేశారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ తులసీరామ్, డిప్యూటి తహసీల్దార్ కిషోర్, ఎంపీడీవో విట్టలఖ, ఆర్‌ఐ సాయి శ్రీకాంత్,ఈవో రాకేష్ తదితరులు ఉన్నారు.

నిరంతర ప్రక్రియ

మెదక్ అర్బన్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): కొత్త రేషన్‌కార్డుల జారీ నిరంతర ప్రక్రియ అని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్ నుంచి ఆయా శాఖల అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ నెల 26న నాలుగు ప్రతిష్ఠాత్మక పథకాల అమలుకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టబోతుందన్నారు. క్షేత్రస్థాయి సర్వే పరిశీలనలో ఆలసత్వం వహించకుండా వేగవంతంగా చేసి, రేపటి లోగా పూర్తి చేయాలని ఆదేశించారు.



సర్వే సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్

కుటుంబసభ్యుల మందలింపుతో ఉరేసుకున్న యువతి

రాయపోల్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): రాయపోల్ మండలం వడ్డేపల్లి గ్రామానికి చెందిన గుండారం అంజలి(20) ఆదివారం ఉరేసుకుని మృతి చెందిన విషయం తెలిసిందే. ఎస్ఐ రఘుపతి ఆత్మహత్య కారణాలను సోమవారం వెల్లడించారు. అంజలి అదే గ్రామానికి చెందిన ఒకరిని ప్రేమించి అతనితో వెళ్లిపోయింది. ఆమె తల్లిదండ్రులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా వారిని పట్టుకుని కుటుంబసభ్యులకు అప్పగించారు. ఒకరి జీవితంలోకి మరొకరు రావొద్దని నిర్ణయించుకున్నారు. కొన్ని రోజులుగా అంజలి అదే వ్యక్తితో ఫోన్‌లో మాట్లాడుతుండగా, కుటుంబసభ్యులు ఆమెను మందలించారు. దీంతో మనస్తాపానికి గురై అంజలి ఉరేసుకుని మృతిచెందింది.

క్రైం కార్నర్

ఒత్తిడి భరించలేక పదో తరగతి విద్యార్థిని ఆత్మహత్య



సహస్ర(ఫైల్)

తూప్రాన్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షలు దగ్గరపడుతుండడంతో ఒత్తిడిని తట్టుకోలేక విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మెదక్ జిల్లా తూప్రాన్ పట్టణంలో సోమవారం చోటుచేసుకున్నది. తూప్రాన్ ఎస్ఐ-2 యాదగిరి కథనం ప్రకారం.. సిద్దిపేట జిల్లా అల్వాల్‌కు చెందిన గుర్రపుగారి సుధాకర్, మమత దంపతులు తూప్రాన్ పట్టణంలో నివాసముంటున్నారు. భార్య బీడీలు చేస్తుండగా, భర్త కూలీ పనులు చేస్తున్నాడు. చిన్న కూతురు సహస్ర(15) తూప్రాన్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతుంది. చదువులో వెనుకబడటంతో బాగా చదువుకోవాలని తండ్రి కూతురుకు సూచించారు. ఎంత చదివినప్పటికీ చదువు అబ్బటంలేదని, గుర్తుకు ఉండటంలేదని సహస్ర మథనపడుతూ ఉండేది. సోమవారం ఉదయం తండ్రి కూలీ పనికి వెళ్లగా, తల్లి బీడీలను కార్ఖానాలో ఇచ్చేందుకు వెళ్లింది. పెద్ద కూతురు కళాశాలకు వెళ్లగా, ఇంట్లో ఒంటరిగా ఉన్న సహస్ర (15) ఒత్తిడిని భరించలేక ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నది. ఇంటికి వచ్చిన తల్లి గుర్తించి ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు గుర్తించారు. ఈమేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శివానందం వివరించారు.

మినీ వ్యాన్ ఢీకొని యువకుడి మృతి



అనిల్(ఫైల్)

ములుగు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): మినీ వ్యాన్ మోటార్‌సైకిల్‌ను ఢీకొని ఓ యువకుడు మృతిచెందిన సంఘటన ములుగు మండల పరిధిలో సోమవారం చోటుచేసుకున్నది. వివరాల్లోకి వెళితే.. మండలంలోని క్షీరసాగర్ గ్రామానికి చెందిన గంగమ్మ, నర్సింహులు కుమారుడు అనిల్(18). సోమవారం అనిల్ గ్రామం నుంచి మోటార్‌సైకిల్‌పై వంటిమామిడి వైపు వస్తున్నాడు. కూరగాయల లోడ్‌ను ఖాళీ చేసుకుని వస్తున్న అశోక్ లేలాండ్ మినీ వ్యాన్ జప్తిసింగాయపల్లి సమీపంలో మోటార్ సైకిల్‌ను ఢీకొన్నది. దీంతో అనిల్ రోడ్డుపై పడి అక్కడికక్కడే మృతి చెందాడు. తండ్రి నర్సింహులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపారు.

వంతెనపై నుంచి కింద పడిన లారీ

డ్రైవర్, క్లీనర్‌కు గాయాలు



సంగుపేట వద్ద వంతెనపై నుంచి పడిన లారీ

జోగిపేట, జనవరి20 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా అందోలు మండలం సంగుపేట జాతీయ రహదారిపై సోమవారం ఉదయం ఓ లారీ వంతెనపై నుంచి బోల్తా కొట్టగా, లారీ నుజ్జునుజ్జు కాగా, డ్రైవర్, క్లీనర్ గాయాలపాలయ్యారు. వివరాలిలా ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూల్ జిల్లా బేతంచెర్ల నుంచి నాపరాళ్ల(బండలు) లోడ్‌తో లారీ రాజస్థాన్ వెళ్తున్నది. సంగుపేట వద్ద జాతీయ రహదాదారిపై గల వంతెనపైనుంచి అదుపుతప్పి, పల్టీకొట్టి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో బ్రిడ్జిపైనుంచి పడిన లారీ నుజ్జునుజ్జైంది. అయితే, లారీ డ్రైవర్ షకీర్ క్యాబిన్‌లోనే ఇరుక్కుపోగా, క్లీనర్ ధర్మేందర్‌సింగ్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. సమాచారం అందిన వెంటనే ఎస్ఐ పాండు సిబ్బందితో కలిసి ఘటనాస్థలానికి చేరుకున్నారు. 3 గంటల పాటు కష్టపడి గ్యాస్ కట్టర్‌తో క్యాబిన్‌ను కోసి డ్రైవర్ షకీర్‌ను బయటకు తీశారు. వారిని జోగిపేట ఏరియా ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్సచేయించి, మెరుగైన చికిత్సకోసం సంగారెడ్డి జిల్లా ఆస్పత్రికి తరలించినట్టు ఎస్ఐ పాండు తెలిపారు. కాగా, శివమాలలో ఉన్నప్పటికీ.. విధి నిర్వహణ మరువక.. క్యాబిన్‌లో ఇరుక్కుపోయిన డ్రైవర్‌ను వెలికితీసిన హోంగార్డు శ్రీశైలంను పలువురు అభినందించారు.

తాలెల్మ హత్య ఘటన ఛేదన

సెల్‌ఫోన్, బైక్ కోసం ఘాతుకం

ఇద్దరి నిందితులకు రిమాండ్

జోగిపేట, జనవరి20(ఆంధ్రజ్యోతి): సెల్‌ఫోన్, మోటార్ సైకిల్ కోసం ఓ యువకుడి గొంతుకోసి, ఆపై బండరాతితో మోదీ హత్య చేసిన ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్టు జోగిపేట సీఐ అనిల్‌కుమార్ సోమవారం తెలిపారు. ఈనెల12న మండలంలోని తాలెల్మ గ్రామ శివారులో నాదులాపూర్‌కు చెందిన కర్రోల్ల శ్రీనివాస్ దారుణ హత్యకు గురైన సంగతి తెలిసిందే. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. కర్రోల్ల శ్రీనివాస్‌కు, జోగిపేటకు చెందిన బావ, బావమరుదులు సద్దాంహుస్సేన్, యూనిస్‌లకు కల్లు తాగే అలవాటుంది. వీరంతా తాలెల్మ గ్రామంలోని కల్లు దుకాణానికి తరచుగా వెళ్లేవారు. ఈ క్రమంలో సద్దాం, యూనిస్‌తో శ్రీనివాస్‌కు పరిచయం ఏర్పడింది. వారు ముగ్గురు ఈనెల 12న తాలెల్మ శివారులోని చెక్‌డ్యాం వద్ద నిర్జన ప్రదేశంలో కల్లు తాగుతున్నారు. తనకున్న అలవాటు ప్రకారం శ్రీనివాస్ సెల్‌ఫోన్‌లో లూడో గేమ్ ఆడుతుండగా, తాము కూడా ఆడతానని, ఓడిన వారు గెలిచిన వారికి మద్యం తాగించాలని పందెం కాసుకున్నారు. ఈక్రమంలో ఓడిపోయిన శ్రీనివాస్, యూనిస్‌తో కలిసి మర్వెల్లిలోని మద్యం, తినుబండారాలు తీసుకుని రాగా, సద్దాం కల్లు తీసుకుని అక్కడికి చేరుకున్నారు. ముగ్గురు తాగుతుండగా శ్రీనివాస్ వద్ద ఉన్న మొబైల్ ఫోన్, మోటార్‌సైకిల్‌ను తస్కరించి అమ్ముకోవాలని సద్దాం, యూనిస్‌లు ఆశపడ్డారు. వీరిద్దరూ కలిసి బీర్ బాటిల్‌ను పగులగొట్టి శ్రీనివాస్ పీక కోశారు. ఆపై బండరాతితో శ్రీనివాస్ తలపై మోదీ హత్య చేశారు. మృతుడి సెల్‌ఫోన్, మోటార్‌సైకిల్‌ను తీసుకుని ఒకరు, సొంత బైక్‌ను తీసుకుని ఇంకొకరు హైదరాబాద్ వెళ్లి బైక్‌ను అమ్మేశారు. దర్యాప్తులో భాగంగా సేకరించిన సమాచారం మేరకు సద్దాంహుస్సేన్, యూనిస్‌ను విచారించగా నేరాన్ని అంగీకరించారు. ఈ మేరకు వారిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్టు సీఐ అనిల్‌కుమార్ తెలిపారు.

కొండపాక శివారు అడవిలో మంటలు

అప్రమత్తమైన అటవీశాఖ అధికారులు



అడవిలో అంటుకున్న మంటలు

కొండపాక, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : కొండపాక శివారులోని అటవీ ప్రాంతంలో సోమవారం మంటలు చెలరేగాయి. విషయాన్ని తెలుసుకున్న అటవీ శాఖ అధికారులు అప్రమత్తం కావడంతో పెనుముప్పు తప్పింది. అటవీ అధికారులు వెంటనే అక్కడకు చేరుకుని మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. సుమారు పది ఎకరాలకు మంటలు వ్యాపించినట్లు తెలిసింది. ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ఇక్ర మొద్దీన్, సిద్దిపేట డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ పద్మ, సెక్షన్ ఆఫీసర్‌లు రమేష్, ముజీబుద్దీన్, బీట్ అధికారులు చంద్రశేఖర్, జ్యోతి, రవికిరణ్ తదితరులు పచ్చిచెట్ల కొమ్మలను పట్టుకుని మంటలను ఆర్పారు. మంటలు వ్యాపించకుండా రెండు గంటల పాటు శ్రమించారు.

సిగమూగిన కొమురవెల్లి



పట్నం, అగ్నిగుండాలను తిలకిస్తున్న భక్తులు



పట్నం, అగ్నిగుండాలు దాటడం ప్రారంభిస్తున్న అర్చకులు, యాదవ సంఘం ప్రతినిధులు



వీరకోలలతో వీరంగమాడుతున్న ఆచారవతుడు



ఒగ్గుకథ చెబుతున్న యాదవ కళాకారుల బృందం



శివమెత్తుతున్న సాధువు

కొమురవెల్లి క్షేత్రం బండారిమయంగా మారింది. భాగ్యనగర యాదవ పూజారులు పంచరంగులతో పెద్దపట్నాన్ని తీర్చిదిద్ది.. మల్లన్న మహిమల ఒగ్గుకథలను హోరెత్తించగా.. వీరకోలలు చేతపట్టి శివసత్తులు సిగాలూగారు. తోటబావి ప్రాంగణం మల్లన్న నామస్మరణతో మార్మోగింది. భక్తులు అగ్నిగుండాలను దాటి స్వామి వారి సన్నిధికి దారి కట్టారు. మల్లన్నను దర్శించుకుని తన్మయత్వం పొందారు.



అగ్నిగుండాలను దాటి తోటబావి నుంచి ఆలయానికి వెళ్తున్న భక్తులు





వీరకోలలతో శివసత్తులు, ఝుతాఝుటంతో సిగమూగుతున్న భక్తురాలు

బండారు మల్లన్నా.. గండాలు బాపన్నా

5వ పేజీ తరువాయి

పూయడంతో ఆలయ పరిసరాలన్నీ పసుపుమయంగా మారింది. పట్నంవేయడం, అగ్నిగుండాలు కాలడం పూర్తికాగానే గర్భాలయం నుంచి అర్చకులు మహదేవుని మల్లికార్జున్, భాస్కర్, రవి ఉత్సవ విగ్రహాలను తీసుకువచ్చి పట్నంచుట్టూ ప్రదక్షిణలు చేశారు. యాదవులు గుమ్మడికాయలను బలిహరణ చేయగానే అర్చకులు అగ్నిగుండాలను దాటడం ప్రారంభించారు. అనంతరం భక్తులు మల్లన్నను స్మరిస్తూ అగ్నిగుండాలను దాటారు. అక్కడి నుంచి నేరుగా ఆలయానికి చేరుకుని స్వామివారిని దర్శించుకున్నారు. శివసత్తులు, భక్తులకు ఆలయ సంప్రదాయం ప్రకారం కనుములు అందించి సత్కరించారు. పలువురు భక్తులు బెల్లం పానకం, నీళ్ల ప్యాకెట్లను, మరికొందరు అన్నప్రసాదం వితరణ చేశారు. ఇంకొందరు బండారిని పంపిణీ చేశారు. అనంతరం భక్తులు కొండపోచమ్మ దర్శనానికి తరలివెళ్లారు. ఈవో రామాంజనేయులుతో పాటు ధర్మకర్తలు పాల్గొన్నారు. హుస్నాబాద్ ఏసీపీ సతీశ్, చేర్యాల సీఐ ఎల్.శ్రీను ఆధ్వర్యంలో పటిష్ట బందోబస్తు చర్యలు చేపట్టారు. తోటబావి ప్రాంగణంలో భక్తులగుంపులో తోపులాటకు గురైన ఓ వృద్ధురాలు స్పృహతప్పి పడిపోయింది. దీంతో ఏఆర్ కానిస్టేబుల్ రజనీకాంత్ బయటకు ఎత్తుకుని వచ్చి వైద్య సిబ్బందితో చికిత్స అందించారు.

అమ్మా బైలెల్లినామో..

- కొమురవెల్లి నుంచి కొండపోచమ్మ చెంతకు భక్తులు
- ఘనంగా జాతర ప్రారంభం

జగదేవ్‌పూర్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : కొండపోచమ్మ జాతర సోమవారం ఘనంగా ప్రారంభమైంది. కొమురవెల్లి మల్లన్నను దర్శించుకున్న భక్తులు తిరుగు ప్రయాణంలో ఆనవాయితీగా కొండపోచమ్మ సన్నిధికి చేరుకున్నారు. దీంతో మండలంలోని తిగుల్ నర్సాపూర్ గ్రామ సమీపంలోని ఆలయానికి వచ్చే రహదారి మధ్యాహ్నం నుంచి వాహనాలతో కిక్కిరిసిపోయింది. భక్తులు కొత్త కుండల్లో నైవేద్యాన్ని వండి, డప్పుచప్పుల మధ్య బోనమెత్తి అమ్మవారి ఆలయానికి ఊరేగింపుగా వచ్చారు. శివసత్తుల సిగాలు, పోతరాజుల నృత్యాలతో కొండపోచమ్మ క్షేత్రం భక్తజనసంద్రంగా మారింది. అమ్మవారికి బోనం నివేదించి, ఒడిబియ్యం పోసి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ఈవో రవికుమార్ ఆధ్వర్యంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకున్నారు. ఎస్ఐ చంద్రమోహన్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించగా, ట్రాఫిక్‌జామ్ తలెత్తకుండా చర్యలు చేపట్టారు. జిల్లా ఒకటో సెషన్ న్యాయాధికారి శ్రావణి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.



అమ్మవారిని దర్శించుకుంటున్న న్యాయాధికారి శ్రావణి



ఆలయానికి వచ్చే తిగుల్ నర్సాపూర్ దారిలో వాహనాలు

అంబేడ్కర్‌ను అవమానించిందే కాంగ్రెస్

- భారతరత్న అవార్డు ఇచ్చి గౌరవించింది బీజేపీ
- మెదక్ ఎంపీ రఘునందన్‌రావు



మాట్లాడుతున్న ఎంపీ రఘునందన్‌రావు

సంగారెడ్డి టౌన్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను కాంగ్రెస్ అడుగడుగున అవమానించిందని మెదక్ ఎంపీ ఎం.రఘునందన్‌రావు అన్నారు. సంగారెడ్డిలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడూ అంబేడ్కర్‌ను ఎన్నికల్లో ఓడించిన చరిత్ర కాంగ్రెస్‌దేనన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అంబేడ్కర్‌కు భారతరత్న అవార్డును ప్రకటించిన విషయం ప్రజలకు తెలిసిందేనన్నారు. రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిగా అంజిరెడ్డిని అధిష్ఠానం ప్రకటించిందన్నారు. ఆయన గెలుపు కోసం పట్టభద్రులు, బీజేపీ శ్రేణులు మద్దతు తెలపాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తున్నా ఆరు గ్యారంటీలను అమలు చేయకుండా ప్రజలను మోసగించిందని ఆరోపించారు. కాంగ్రెస్ చేసిన ఆరు గ్యారంటీల మోసాన్ని జనంలో ఎండగడుతూ భారత్ సంవిధాన్ గౌరవ్ దివస్ కార్యక్రమాన్ని వారం రోజుల పాటు నిర్వహించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి, ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డి, నాయకులు మందుల నాగరాజు, కసిని వాసు, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

అనాజీపూర్‌లో చాళుక్యుల నాటి ఆనవాళ్లు



వినాయకుని విగ్రహం

రాయపోల్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లా రాయపోల్ మండలం అనాజీపూర్ పరిధిలో చాళుక్యుల కాలం నాటి విగ్రహాలను గుర్తించినట్లు కొత్త తెలంగాణ చరిత్ర బృందం ఔత్సాహిక పరిశోధకుడు కొలిపాక శ్రీనివాస్ తెలిపారు. సోమవారం ఆయన వివరాలను వెల్లడించారు. అనాజీపూర్ గ్రామానికి కిలోమీటరు దూరంలో ప్యాట ప్రాంతంలో ఉన్న ఆంజనేయ స్వామి ఆలయం వద్ద వెయ్యి ఏళ్ల క్రితం నాటివిగా భావిస్తున్న నంది, వినాయకుడు, నాగశిల విగ్రహాలను కనుగొన్నారు. అనాజీపూర్ సమీపంలో 17వ శతాబ్దం నాటి శైలిని పోలిన వీరగల్లు శిల్పం, పోచమ్మ ఆలయం వద్ద మరో వీరగల్లు శిల్పాన్ని గుర్తించినట్లు తెలిపారు.

కుక్కల దాడిలో బాలుడికి తీవ్ర గాయాలు

చికిత్స నిమిత్తం వికారాబాద్ జిల్లా మర్పల్లిలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలింపు



కుక్కల దాడిలో తీవ్రంగా గాయపడిన ప్రణయ్‌కుమార్

కోహీర్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : కుక్కల దాడిలో బాలుడికి తీవ్ర గాయాలైన సంఘటన కోహీర్ మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామంలో సోమవారం రాత్రి 8 గంటల ప్రాంతంలో జరిగింది. వివరాల్లోకి వెళితే.. నాగిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన బోయిన సిద్ధప్ప కుమారుడు ప్రణయ్‌కుమార్ ఇంటి బయట ఆడుకుంటుండగా ఒకేసారి కుక్కల గుంపు బాలుడిపై దాడి చేశాయి. బాలుడి కాళ్లు, చేతులు, ముఖంపై కరవడంతో తీవ్ర గాయాల పాలయ్యాడు. గమనించిన స్థానికులు అక్కడ నుంచి కుక్కలను తరిమివేశారు. అప్పటికే తీవ్రగాయాలైన ప్రణయ్‌కుమార్‌ను హుటాహుటిన వికారాబాద్ జిల్లాలోని మండల కేంద్రమైన మర్పల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ సందర్భంగా పలువురు నాగిరెడ్డిపల్లి గ్రామస్థులు మాట్లాడుతూ.. తమ గ్రామానికి ఎక్కడ నుంచి వచ్చాయో ఏమో కానీ దాదాపు 200 వరకు కుక్కలు ఉన్నట్లు వారు పేర్కొన్నారు. కుక్కలు ఎక్కువగా సంచరిస్తూ ఉండడం వల్ల పిల్లలను ఆరుబయటకు పంపాలంటే భయమేస్తుందన్నారు. కుక్కల బెడదల నుంచి గ్రామస్థులను రక్షించాలని పలమార్లు అధికారులకు తెలియజేసిన పట్టించుకోవడం లేదని వారు వాపోయారు.

బస్సులో ప్రయాణిస్తూ

రిటైర్డ్ ఆర్టీసీ డ్రైవర్ మృతి

అక్కన్నపేట, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ నుంచి హుస్నాబాద్‌కు ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న రిటైర్డ్ ఆర్టీసీ సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం బద్దిపడిగ వద్ద ఆకస్మికంగా మృతిచెందిన సంఘటన సోమవారం రాత్రి చోటుచేసుకున్నది. వివరాల్లోకి వెళ్తే అక్కన్నపేట మండలం చౌటపల్లి గ్రామానికి చెందిన చుంచు వెంకటయ్య(65) ఆర్టీసీలో డ్రైవర్‌గా పనిచేసి రిటైడయ్యారు. హైదరాబాద్‌కు భార్య లక్ష్మితో ఆస్పత్రికి వెళ్లి తిరిగి వస్తుండగా మార్గమధ్యంలో ఆకస్మికంగా మృతిచెందారు. ఆయనకు భార్య లక్ష్మితోపాటు కుమార్తె ఉన్నారు. వెంకటయ్య మృతిచెందడంతో ఆర్టీసీ బస్సును అక్కడే నిలిపివేశారు. బంధువులు మృతదేహాన్ని తీసుకురావడానికి వెళ్లారు.

కబేళాకు తరలిస్తున్న 34 గోవుల పట్టివేత

ములుగు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): రాజీవ్‌రహదారి నుంచి కబేళాకు తరలిస్తున్న గోవులను సోమవారం తెల్లవారుజామున భజరంగ్‌దళ్ సభ్యులు అడ్డుకుని పోలీసులకు అప్పగించారు. భజరంగ్‌దళ్ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట వైపు నుంచి హైదరాబాద్‌కు 34 గోవులను కబేళాకు తరలిస్తుండగా నమ్మదగిన సమాచారం మేరకు ములుగు భజరంగ్‌దళ్ సభ్యులు పట్టుకున్నారు. వాహనాన్ని ఆపగా, డ్రైవర్ దిగి పారిపోయాడు. వెంటనే ఈ గోవులను పోలీస్‌స్టేషన్‌కు తరలించి, పశు వైద్యాధికారులను రప్పించి వైద్య పరీక్షలు చేయించారు. అనంతరం గోవులను గోశాలకు తరలించనున్నట్లు పోలీసులు తెలిపారు. గోవుల తరలింపుపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపారు.

న్యూస్ బాక్స్

'కురుమలు ఆర్థికంగా, రాజకీయంగా ఎదగాలి'

నారాయణఖేడ్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : కురుమలు ఆర్థికంగా, రాజకీయంగా ఎదగాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కరికే సత్యనారాయణ అన్నారు. ఖేడ్‌లో సోమవారం నియోజకవర్గ కురుమ సంఘం నాయకుల సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో కురుమలు పోటీచేసి అధికస్థానాల్లో గెలిచి సత్తాచాటాలన్నారు. ఈ కార్యక్రమంలో గొర్రెలు, మేకల పెంపకందారుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాపుమల్‌శెట్టి, ఆర్సీపురం మాజీ కార్పొరేటర్ తొంట అంజయ్య, కురుమ సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు కిష్టయ్య మాస్టర్ పాల్గొన్నారు.

విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటుకు స్థల పరిశీలన

రామచంద్రాపురం టౌన్ జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : తరచూ ఏర్పడుతున్న విద్యుత్ సరఫరాలో అంతరాయాలను తగ్గించేందుకు ప్రత్యేకంగా సబ్‌స్టేషన్ ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామని విద్యుత్‌శాఖ డీఈ భాస్కర్‌రావు అన్నారు. సోమవారం భారతీనగర్ డివిజన్ పరిధి బీడీఎల్ కాలనీల వెనుకవైపు ఖాళీస్థలాన్ని పరిశీలించారు. అనంతరం ఇక్రిశాట్ ఫెన్సింగ్ ఏరియాలో విద్యుత్‌తీగలు కిందికి వేలాడుతున్నాయని, తొలగించే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

డబ్బులు డిమాండ్ చేసిన రిపోర్టర్‌పై కేసు నమోదు

మెదక్ అర్బన్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): లారీ డ్రైవర్ వద్ద డబ్బులు డిమాండ్ చేసిన ఓ మీడియా రిపోర్టర్‌పై పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. పట్టణ సీఐ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం సోమవారం బోధన్ చౌరస్తా వద్ద కట్టెల లోడ్‌తో వెళ్తున్న లారీని మెదక్ పట్టణానికి ఓ రిపోర్టర్ ఆపి డ్రైవర్‌ను డబ్బులు డిమాండ్ చేశాడు. తన బైక్‌ను రోడ్డుకు అడ్డంగా పెట్టి డ్రైవర్‌ను బెదిరించాడు. దాంతో లారీ డ్రైవర్ 100కు కాల్ చేయగా.. పట్టణ పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లగా సిద్దు అక్కడి నుంచి పారిపోయాడు. లారీ డ్రైవర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు రిపోర్టర్ సిద్దుపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

స్కూల్ బస్సుల డ్రైవర్లకు డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు

పటాన్‌చెరు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ప్రమాదాలను నివారించేందుకు సోమవారం పటాన్‌చెరు పట్టణ శివారులోని ఇంద్రేశం ఎక్స్‌రోడ్డులో ఆయా పాఠశాలల బస్సుల డ్రైవర్లకు ట్రాఫిక్ పోలీసులు డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ మాట్లాడుతూ విద్యార్థులను సురక్షితంగా తీసుకెళ్లాల్సిన బస్సు డ్రైవర్ల పట్ల యాజమాన్యాలు అప్రమత్తంగా ఉండాలన్నారు.

బీటీరోడ్డు నిర్మించాలని వినతి

హవేళిఘణపూర్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మాయిపల్లి గ్రామం నుంచి కామారెడ్డి జిల్లా పరిధి రాజంపేట మండలంలోని గుండారం గ్రామం వరకు బీటీ రోడ్డు నిర్మించాలని బీజేపీ మండల కార్యదర్శి రూపేందర్ తహసీల్దార్ సింధురేణుకకు సోమవారం విన్నవించారు.

క్రైం కార్నర్

కిష్టయ్యపల్లిలో యువకుడి ఆత్మహత్య

జిన్నారం, జనవరి, 20 (ఆంధ్రజ్యోతి): జిన్నారం మండలం గడ్డపోతారం పరిధిలోని కిష్టయ్యపల్లిలో ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సోమవారం కిష్టయ్యపల్లి గ్రామానికి చెందిన ప్రసాద్(20) ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సాయంత్రం 6 గంటల ప్రాంతంలో ఇంటికి వచ్చిన తల్లిదండ్రులు కుమారుడు ఆత్మహత్యకు పాల్పడ్డట్టు గమనించి ఆసుపత్రికి తరలించగా.. అప్పటికే మృతిచెందాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉన్నది.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

- రూ.53 వేల నగదు స్వాధీనం

మనూరు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : రహస్యంగా పేకాడుతున్న స్థావరంపై మనూరుపోలీసులు దాడులు నిర్వహించారు. ఎస్ఐ శంకరయ్య వివరాల ప్రకారం.. మనూరు మండలం రాణాపూర్ గ్రామ సమీపంలో పేకాడుతున్నట్లు నమ్మదగిన సమాచారం మేరకు సోమవారం ఉదయం దాడులు నిర్వహించి పేక ముక్కలతోపాటు రూ.53 వేల నగదును స్వాధీనం చేసుకొని, ఆరుగురిని అదుపులోకి తీసుకుని, కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మరో ఇద్దరు పరారీలో ఉన్నారని ఎస్ఐ తెలిపారు.



సంగారెడ్డి కలెక్టరేట్‌లో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ క్రాంతి



మెదక్ అర్బన్: వినతులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ నగేష్

'ప్రజావాణి' సమస్యలు త్వరితగతిన పరిష్కరించండి

- సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి
- ప్రజావాణికి 58 అర్జీలు

సంగారెడ్డి రూరల్/మెదక్ అర్బన్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : ప్రజావాణిలో వచ్చే సమస్యలు త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి ఆదేశించారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణికి 58 అర్జీలను ఆమె స్వీకరించి మాట్లాడారు. తమ సమస్యలు ఇక్కడ పరిష్కారమవుతాయని ఎంతో నమ్మకంతో ఇక్కడికి వస్తారని, వారి నమ్మకాన్ని అధికారులు వమ్ము చేయకుండా సామరస్యంగా పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. ప్రజావాణిలో స్వీకరించిన విజ్ఞప్తులను వెంటనే పరిష్కరించాలని మెదక్ అదనపు కలెక్టర్ మెంచు నగేష్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణికి మొత్తం 102 అర్జీలు వచ్చాయి. ఇందులో ధరణి 38, ఇందిరమ్మ ఇండ్లు 11, రేషన్‌కార్డులు 10, రుణమాఫీ 3, ఇతర సమస్యలకు సంబంధించి 40 దరఖాస్తులు ఉన్నాయి. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. ఫిర్యాదుదారులతో మమేకమై వారి సమస్యలను పరిశీలించి పరిష్కార దిశగా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో భుజంగరావు, జెడ్పీ సీఈవో ఎల్లయ్య, డీఆర్డీవో శ్రీనివాసరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. బాలికా సాధికారతలో మెదక్ జిల్లాను ప్రథమస్థానంలో నిలపాలని అదనపు కలెక్టర్ మెంచు నగేష్ అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ, మహిళా సాధికారిక కేంద్రం, మిషన్ శక్తి ఆధ్వర్యంలో బేటి బచావో బేటి పడావో కార్యక్రమంపై సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..బేటి బచావో బేటి పడావో పథకం 10 ఏళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా ఉత్సవాలు నిర్వహించడానికి కార్యాచరణ రూపొందించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి జితేందర్, జిల్లా మహిళా స్త్రీ శిశు సంక్షేమశాఖ అధికారి హైమావతి, అదనపు ఎస్పీ మహేందర్, డీఆర్డీవో పీడీ శ్రీనివాసరావు, డీఎంహెచ్‌వో డా.శ్రీరామ్, సీడీపీవోలు తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదులను పరిష్కరించాలి

మెదక్ అర్బన్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): పోలీసు ప్రజావాణి వచ్చే ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి సూచించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజావాణిలో భాగంగా ఆయన ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించి వారితో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బాధితులకు న్యాయం చేయాలని పోలీసు అధికారులకు ఫోన్‌లో ఆదేశించారు.

అన్నివర్గాల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం: ఎమ్మెల్యే



పెద్దశంకరంపేట: బుజ్రాన్‌పల్లిలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్/పెద్దశంకరంపేట/నాగల్‌గిద్ద, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): అన్నివర్గాల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని నారాయణఖేడ్ ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమీపంలో ఇందిరమ్మ నమూనా గృహ నిర్మాణానికి భూమి పూజ చేశారు. సంజీవన్‌రావుపేట, నిజాంపేటలకు చెందిన 20 మంది కుమ్మరి కులవృత్తుల వారికి నూతన పద్ధతిలో లాభసాటిగా ఉండేలా శిక్షణపొందగా వారికి ధ్రువపత్రాలు, పనిముట్లను పంపిణీ చేసి మాట్లాడారు. ఇందిరమ్మ గృహాలు అర్హులందరికీ అందుతాయన్నారు. ఈ కార్యక్రమంలో గృహ నిర్మాణశాఖ పీడీ చలపతిరావు, ఏఈలు సత్యనారాయణ, కోటేశ్వర్‌రావు మున్సిపల్ చైర్మన్ ఆనంద్ స్వరూప్ షెట్కార్, వైస్ చైర్మన్ దారం శంకర్, కౌన్సిలర్లు రాజేష్ చౌహాన్, నర్సింలు, మాజీద్, రామక్రిష్ణ, హన్మండ్లు, రమేష్ చౌహాన్, పండరి, నిజాంపేట మాజీ ఎంపీటీసీ లింగారెడ్డి పాల్గొన్నారు. అలాగే పెద్దశంకరంపేట మండల పరిధిలోని బుజ్రాన్‌పల్లిలో సీసీరోడ్డు పనులకు శంకుస్థాపన, పెద్దశంకరంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పలు రికార్డులను ఎమ్మెల్యే సంజీవరెడ్డి తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ గ్రేస్‌బాయ్, ఎంపీడీవో రఫీక్ ఉన్నిసా, ఎంఈవో వెంకటేశం, పేట మాజీ సర్పంచులు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాయినిమధు, నాయకులు పాల్గొన్నారు. నాగల్‌గిద్ద మండలం కరస్‌గుత్తి గ్రామంలో వారంరోజుల నుంచి కొనసాగుతున్న పీకేఆర్ క్రికెట్ టోర్నమెంట్ ముగింపునకు ఎమ్మెల్యే హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గుండేరావుపటేల్, పీఏసీఎస్‌సీ చైర్మన్ శ్రీకాంత్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సచిన్‌పటేల్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ పటిష్టతకు కృషి చేయాలి

- మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్



ఈటలను శాలువాతో సన్మానిస్తున్న కోణం విఠల్

పెద్దశంకరంపేట, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని గ్రామీణ ప్రాంతాల్లో బీజేపీ పటిష్టత కోసం నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో బీజేపీ మండల అధ్యక్షుడు కోణం విఠల్, బీజేపీ నారాయణఖేడ్ నియోజకవర్గ నాయకులు పత్రి రామక్రిష్ణ, సంజీవరెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఈటల మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలను గ్రామాల్లో ప్రజలందరికీ వివరించాలని పిలుపునిచ్చారు.

బీటీరోడ్డుతో ఇబ్బందులకు చెక్



రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

నర్సాపూర్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): బీటీరోడ్డు నిర్మాణంతో ప్రజలకు ఇబ్బందులు తొలగిపోనున్నాయని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి పేర్కొన్నారు. సోమవారం నర్సాపూర్ మండలం మూసాపేట పీడబ్ల్యూడీ రోడ్డు నుంచి తౌర్యాతండా వరకు బీటీరోడ్డు పనులకు ఆమె శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ బబియానాయక్, మాజీ సర్పంచ్ సేనాపతి, నాయకులు జీవన్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, శ్రీశైలం, జలీల్, నవీన్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

పనులు ప్రారంభించాలని సీఎంను కలుస్తా

- సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రభాకర్

సంగారెడ్డి టౌన్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : గత ప్రభుత్వంలో మంజూరైనా పనులను ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో రద్దు చేసిందని, అభివృద్ధి కోసం మంజూరైనా పనులను మళ్లీ ప్రారంభించాలని సీఎం రేవంత్‌రెడ్డిని కలుస్తాని సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ తెలిపారు. సోమవారం సంగారెడ్డి పట్టణంలోని సగర ఉప్పర సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన క్యాలెండర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. ఉప్పర సంఘానికి ఎలాంటి సమస్యలు ఉన్నా తోడుగా ఉండి పోరాడుతానని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీడీసీ మాజీ చైర్మన్లు విజేందర్‌రెడ్డి, బుచ్చిరెడ్డి, సగర ఉప్పర సంఘం జిల్లా అధ్యక్షుడు మురళీకృష్ణ, కౌన్సిలర్ రమప్ప, రవి, వెంకటయ్య, ఆంజనేయులు, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

బెల్టుషాపులు ఎత్తివేయాలి: కేజీకేఎస్



సంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న కేజీకేఎస్ నాయకులు

సంగారెడ్డి రూరల్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో అక్రమంగా నిర్వహిస్తున్న బెల్టు షాపులు ఎత్తివేయాలని కల్లుగీత కార్మిక సంఘం (కేజీకేఎస్) జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆశన్నగౌడ్, రమేష్‌గౌడ్ డిమాండ్ చేశారు. సంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట సోమవారం కేజీకేఎస్ నాయకులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బెల్టు షాపుల ద్వారా మద్యం అధిక ధరలకు విక్రయిస్తున్నా పోలీసులు, ఎక్సైజ్ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. దీంతో కల్లు అమ్ముడు పోక గీత కార్మికులు ఉపాధి కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కల్లుగీత కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని, ఏజెన్సీ ప్రాంతాల్లో సొసైటీలను పునరుద్ధరించాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్ వల్లూరు క్రాంతికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ జంగన్నగౌడ్, నాయకులు రామాగౌడ్, రవిగౌడ్, కృష్ణగౌడ్, పవన్ గౌడ్, నారాయణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మల్లన్న జాతర

జిన్నారం/పటాన్‌చెరు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): రాళ్లకత్వలో మల్లన్న ఆలయ ఉత్సవాలు ఘనంగా ప్రారంభం కాగా.. ఉత్సవాల్లో ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి పాల్గొని పూజలు చేశారు. సోమవారం మల్లన్న జాతరను ఘనంగా నిర్వహించారు. ఇందులో ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి, మాజీ జడ్పీ వైస్ చైర్మన్ ప్రభాకర్, మాజీ ఎంపీపీ రవీందర్‌గౌడ్, నాయకులు పాల్గొన్నారు. కాగా ఉత్సవాల్లో మాజీ జడ్పీటీసీ బాల్‌రెడ్డి, చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి, రాజేష్, ప్రభాకర్‌రెడ్డి, నరేందర్, శివరాజ్, జనార్ధన్, మున్సిపల్ కౌన్సిలర్ బీరప్పలు పాల్గొన్నారు. అలాగే పటాన్‌చెరు మండలం ఐనోల్‌లో నిర్వహించిన మల్లన్న జాతరలో ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం జాతర నిర్వాహకులు ఎమ్మెల్యేను సన్మానించారు. ఇందులో మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ ప్రభాకర్, మాజీ ఎంపీపీ శ్రీశైలంయాదవ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్‌కుమార్, నాయకులు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన కాంగ్రెస్ నాయకులు

పుల్‌కల్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): చౌటకూర్ మండలం చక్రియాల గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనరసింహను కలిశారు. జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలోని మంత్రి నివాసానికి సోమవారం వెళ్లి పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో సత్కరించారు. చక్రియాల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని మంత్రిని కోరారు. పురాతనమైన లక్ష్మీ అనంత పద్మనాభస్వామి ఆలయ కమిటీ ఏర్పాటు చేయడం పట్ల మంత్రికి కృతజ్ఞతలు తెలియజేశారు. మంత్రిని కలిసిన వారిలో ఆలయ కమిటీ చైర్మన్ లక్ష్మయ్య, డైరెక్టర్ సత్యనారాయణ, అంజిరెడ్డి, కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు రాజశేఖర్, నీరుడి లక్ష్మీనారాయణముదిరాజ్ ఉన్నారు.

ఉపాధ్యాయుడిపై దాడి హేయమైన చర్య



సంగారెడ్డిలో ఆందోళన చేస్తున్న ఉపాధ్యాయులు

సంగారెడ్డి రూరల్/నారాయణఖేడ్/జహీరాబాద్/నర్సాపూర్/మెదక్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుడిపై మూకదాడి చేయడం హేయమైన చర్య అని యూటీఎఫ్ జిల్లా కమిటీ సభ్యురాలు సుచరిత, మండల ఉపాధ్యక్షురాలు వీణధరి అన్నారు. సంగారెడ్డిలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో, నారాయణఖేడ్ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో పీఆర్టీయూటీఎస్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు హనుమయ్య, రాష్ట్ర కార్యదర్శి జ్ఞానమంజరి, ఉపాధ్యాయులు భోజన సమయంలో నిరసన తెలిపారు. జహీరాబాద్, మొగుడంపల్లి మండలాల్లోని ఆయా పాఠశాలల్లో, నర్సాపూర్ మండలం బ్రాహ్మణపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, పాపన్నపేట ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి భోజన విరామ సమయంలో నిరసన వ్యక్తం చేశారు.

అర్హులందరికీ రేషన్‌కార్డులు: ఆర్డీవో



తూప్రాన్‌లో రేషన్‌కార్డుల సర్వేను పరిశీలిస్తున్న ఆర్డీవో జయచంద్రారెడ్డి

తూప్రాన్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): అర్హులైన కుటుంబాలన్నింటికీ రేషన్‌కార్డులు అందజేస్తామని ఆర్డీవో జయచంద్రారెడ్డి పేర్కొన్నారు. తూప్రాన్ పట్టణ పరిధి తాతపాపన్‌పల్లిలో నూతన రేషన్‌కార్డుల విచారణను తూప్రాన్ మున్సిపల్ చైర్‌పర్సన్ మామిండ్ల జ్యోతికృష్ణతో పరిశీలించారు. సంక్షేమ పథకాలు అర్హులను గుర్తించడానికి సర్వే చేస్తున్నట్లు తెలిపారు. సర్వేలో ఎటువంటి తప్పులు, పొరపాట్లు లేకుండా రేషన్‌కార్డుల సర్వే చేసి నిజమైన అర్హులను గుర్తించాలన్నారు. తూప్రాన్ డివిజన్‌లో మీసేవలో చేసుకున్న 7,700 దరఖాస్తులు, కుటుంబ సర్వేలో 5,786 దరఖాస్తులు వచ్చినట్లు వివరించారు. మీసేవ, కుటుంబ సర్వే, ప్రజాపాలనలో ఎలాంటి దరఖాస్తులు చేయని వారు మంగళవారం నుంచి గ్రామసభలు, వార్డుసభల్లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. కమిషనర్ గణేశ్ రెడ్డి, వార్డు కౌన్సిలర్ మామిడి వెంకటేశ్, మున్సిపల్ మేనేజర్ రఘువరన్ పాల్గొన్నారు.

హరిజనవాడ పేరును అంబేడ్కర్ కాలనీగా మార్చాలి

- కమిషనర్ ఉమాకు దళితుల వినతి

సంగారెడ్డి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : సదాశివపేట పట్టణంలోని హరిజనవాడను డాక్టర్ బీ.ఆర్.అంబేడ్కర్ కాలనీగా పేరు మార్చాలని కోరుతూ సోమవారం హరిజనవాడకు చెందిన దళితులు కోరారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో ఈ విషయమై కమిషనర్ జే.ఉమాకు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. రేషన్‌కార్డులు, ఆధార్‌కార్డులు, పాన్‌కార్డులు, డ్రైవింగ్ లైసెన్స్‌లు, ఇతర మరిన్ని గుర్తింపు కార్డుల్లో హరిజనవాడ అని ఉండడం వల్ల సమాజంలో చిన్నచూపుగా ఉందన్నారు. ప్రభుత్వ పథకాల కోసం దరఖాస్తులు చేసుకునే సమయంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. కొందరు చులకనగా చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దళితుల మనోభావాలను పరిగణలోకి తీసుకుని హరిజనవాడను అంబేడ్కర్ కాలనీగా మార్పు చేస్తూ కౌన్సిల్ తీర్మానం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ యువ నాయకులు చిరంజీవి (చిరు), 3వ వార్డు ప్రజలు వార్డు పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

సింగపూర్‌లో సీఎంను కలిసిన శ్రీనివాస్‌రెడ్డి



తెలుగు సమాజం సభ్యులతో సీఎంను కలిసిన శ్రీనివాస్‌రెడ్డి

మెదక్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : సింగపూర్ పర్యటనలో ఉన్న తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డిని పాపన్నపేట మండలం మల్లంపేటకు చెందిన సింగపూర్ తెలుగు సమాజం ఉపాధ్యక్షుడు పుల్లన్నగారి శ్రీనివాస్‌రెడ్డి కలిశారు. తెలంగాణ రైజింగ్ ప్రధాన ఎజెండాగా సింగపూర్ పర్యటనలో ఉన్న రేవంత్‌రెడ్డి, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబును కలిసి త్వరలో జరగనున్న సింగపూర్ తెలుగు సమాజం స్వర్ణోత్సవ (50వ) వేడుకలకు రావాలని ఆహ్వానించినట్లు తెలిపారు. తెలంగాణ రైజింగ్ కార్యక్రమంలో భాగంగా తమవంతు సహాయ, సహకారాలు అందించనున్నట్లు సీఎంకు చెప్పామని, తనవెంట తెలుగు సమాజం సభ్యులు ఉన్నట్లు వివరించారు.

రియాక్టర్ పేలి ఏడుగురికి గాయాలు

- ఇద్దరి పరిస్థితి విషమం
- ఐడిఎబొల్లారంలో ఘటన

రామచంద్రాపురం టౌన్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : రసాయన పరిశ్రమలో రియాక్టర్ పేలి ఏడుగురు గాయపడిన సంఘటన ఐడిఎబొల్లారం పారిశ్రామికవాడలో శనివారం రాత్రి చోటు చేసుకున్నది. సీఐ రవీందర్‌రెడ్డి, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. శ్రీకర అనే రసాయన పరిశ్రమలో రియాక్టర్‌లో కరెంటు సమస్యలు వచ్చాయి. ఈ క్రమంలో చిన్నపాటి నిప్పురవ్వలు విడుదలయ్యాయి. అనంతరం ఒక్కసారి రియాక్టర్ పేలింది. అక్కడే పనిచేస్తున్న ఏడుగురు కార్మికులు నీలేష్‌సింగ్, పుష్పరాజ్ సింగ్, బ్రజేష్, ఈశ్వరచంద్ర, అగారియ, చాంద్‌ప్రతాప్, షేక్‌అన్వర్ గాయపడ్డారు. ఇందులో ఇద్దరిని చాంద్రాయణగుట్టలోని డీఆర్డీఏ ఆసుపత్రికి తరలించారు. మిగిలిన వారికి స్థానిక ప్రవేటు ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు.

'పాత పంటలతో ఎంతో మేలు'

ఝరాసంగం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): పాత పంటలైన సజ్జలు, రాగులు, సామలు, తైదాలు, జొన్నల వంటి చిరుధాన్యాలను ఆహారంగా తీసుకుంటే ఎంతో ప్రయోజనమని పోట్‌పల్లి మాజీ సర్పంచ్ సిద్ధన్నపాటిల్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని పోట్‌పల్లి గ్రామంలో డీడీఎస్ ఆధ్వర్యంలో ఎడ్లబండ్లపై పాత పంటల ఊరేగింపును చేపట్టారు. మొదట గ్రామంలోని ప్రాథమిక ఉన్నత పాఠశాల విద్యార్థులకు పాత పంటల వల్ల కలిగే ప్రయోజనాల గురించి డీడీఎస్ మహిళా సంఘాల సభ్యులు వివరించారు. ఈ కార్యక్రమంలో కేవీకే ఉద్యానవన శాస్త్రవేత శైలజ, డీడీఎస్ మహిళా సంఘాల సభ్యులు నర్సమ్మ, చుక్కమ్మ, విజయలక్ష్మీ, చిన్న నర్సమ్మ, గ్రామస్థులు మొగులమ్మ, సంపత్ కుమార్, నర్సింలు, ప్రహ్లద్ తదితరులు పాల్గొన్నారు.

'సృజనాత్మకతను వెలికితీసేందుకే పోటీలు'

హవేళిఘణపూర్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీసేందుకు ఫిబ్రవరి 14న మండల పరిధిలోని కూచన్‌పల్లిలో సబ్జెక్టులవారీగా విద్యార్థులకు పోటీలు నిర్వహించనున్నట్లు ఎంఈవో మధుమోహన్ తెలిపారు. ఇందులో భాగంగా తెలుగులో చదవడం, రాయడం, గణితంలో చతుర్విధ ప్రక్రియలపై ఒలంపియాడ్ పద్ధతిలో పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కరుణాకర్, నాగులు, మీరా, నాయకులు సుభాష్‌రెడ్డి, రవి పాల్గొన్నారు.

జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలి

- మాజీ టీఎస్ఐడీసీ చైర్మన్ మహ్మద్ తన్వీర్

జహీరాబాద్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : నిరుద్యోగ యువత ప్రయోజనాన్ని దృష్టిలో పెట్టుకుని, మాజీమంత్రి మహ్మద్ ఫరీదుద్దీన్ జ్ఞాపకార్థం 23న జహీరాబాద్ పట్టణంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నామని మాజీ టీఎస్ఐడీసీ చైర్మన్ మహ్మద్ తన్వీర్ పేర్కొన్నారు. సోమవారం జహీరాబాద్ పట్టణంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పట్టణంలోని ఫ్రెండ్స్ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించే కార్యక్రమానికి సుమారు 100 పైచిలుకు కంపెనీల ప్రతినిధులు, అధికారులు పాల్గొంటారన్నారు. అర్హులైన ప్రతిఒక్కరిని అక్కడే ఎంపికచేసి నియామక పత్రాన్ని అందజేస్తారని తెలిపారు. అనంతరం జాబ్‌మేళాకు సంబంధించి పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు, నాయకులు ఇర్ఫాన్, మోతీరాం, రాములునేత, జహంగీర్, బాబీ, నజీర్, బాల్‌రెడ్డి, కుతుబొద్దీన్, బాసిత్, తదితరులు పాల్గొన్నారు.

'ఎంఎస్' పరిశ్రమ సహకారం అభినందనీయం

మనోహరాబాద్ జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ఎంఎస్ అగర్వాల్ స్టీల్ పరిశ్రమ సహకారం అభినందనీయమని తూప్రాన్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి అన్నారు. సోమవారం మనోహరాబాద్ మండలంలోని చెట్లగౌరారం, రంగాయపల్లి గ్రామ శివారులో గల కంపెనీ సహకారంతో రెండు గ్రామాల ప్రజలకు నెలరోజుల క్రితం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఇందులో కొందరికి కంటి సమస్యలు ఉండడంతో డాక్టర్ల సూచన మేరకు 80 మందికి కళ్లజోళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ పరిశ్రమ సహకారం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ రంగాకృష్ణ, ఎస్ఐ సుభాష్‌గౌడ్, పరిశ్రమ పీఆర్‌వో వెంకటేష్, కార్యదర్శి కవిత, విశాంత్, రాజ్‌కుమార్, పాషా పాల్గొన్నారు.

బకాయిలు చెల్లించాలని కార్మికుల ధర్నా

రామాయంపేట, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : తమకు రావాల్సిన పీఎఫ్ బకాయిలు, నెలవారీ వేతనం విడుదల చేయకపోవడాన్ని నిరసిస్తూ సఫాయి కార్మికులు సోమవారం ధర్నాకు దిగారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. చలిని సైతం తట్టుకుని వేకువజామున పనిచేసే తమకు నెలనెలా జీతాలు సక్రమంగా చెల్లించడం లేదని ఆరోపించారు. తమ బకాయిలు ఇచ్చేవరకు ఆందోళన విరమించబోమన్నారు. కాగా సఫాయి కార్మికుల ధర్నాకు బీజేపీ నేతలు శంకర్‌గౌడ్, భాను సంఘీభావం పలికారు.

క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి

- సీజీఆర్ ట్రస్టు చైర్మన్ చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి



క్రీడాకారులను సన్మానిస్తున్న గోవర్ధన్‌రెడ్డి

గుమ్మడిదల, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంతంలోని యువత చెడుదారి పట్టకుండా... క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలని సీజీఆర్ ట్రస్టు చైర్మన్ చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి అన్నారు. కాగా ట్రస్టు ఆధ్వర్యంలో గుమ్మడిదలలో నిర్వహించిన వాలీబాల్, కబడ్డీ క్రీడల్లో విజేతలను గోవర్ధన్‌రెడ్డి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలోని యువతలో ఉన్న నైపుణ్యాన్ని వెలికితీసేందుకు ఇలాంటి క్రీడలు దోహదపడతాయన్నారు.

కుంభమేళాలో సంగ్రాంమహరాజ్

నారాయణఖేడ్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): అఖిల భారత సాధుసంతుల రాష్ట్ర ప్రతినిధి, నారాయణఖేడ్ మండలం కొండాపూర్ హనుమాన్ ఆశ్రమ పీఠాధిపతి సంగ్రాంమహరాజ్ ఉత్తర్‌ప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్ వద్ద నిర్వహిస్తున్న మహా కుంభమేళాలో అక్కడి ప్రభుత్వం ఆహ్వానం మేరకు సోమవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన వివిధరాష్ట్రాలకు చెందిన స్వామీజీలతో కలిసి త్రివేణి సంగమంలో స్నానాలు ఆచరించి, గంగాదేవికి పూజలు చేశారు. ఆయన వెంట ఇరక్‌పల్లి స్వామి దేవిదాస్‌మహరాజ్ ఉన్నారు.